# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

జనవరి 2025

వెల : రూ. 10.00



## అక్టోబరు 26 నుండి నవంబరు 2 వరకు శ్రీశైలక్షేత్రంలో జరిగిన ఆశ్రమ శాఖ శ
## శివనామ సంకీర్తన మరియు సత్సంగ దృశ్యములు










# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org  samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 44   సంచిక 5
పేజీలు 44
జనవరి 2025

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 7
మేలుకొలుపు ............. .................... .............10
సుభాషితం..........................................................12
నేను లేకపోతే ... ....... .... ...... ......................13
మాయ ........... ............ .......... ........... ......... 15
హనుమత్తత్త్వం..................................................18
భగవద్గీత సాధన దీపిక ..........................20
మోతబరువు.......... ............. ........ ........ ..... ........21
బిల్వదళం - మోక్ష ఫలం...................... ......25
నారద భక్తి సూత్రములు ............... ..............27
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు ......29
శ్రీకాళీ వనాశ్రమం -
గీతా ప్రచార యజ్ఞం ..........30
మనశ్శతకము ...................................................32
నిరీక్షణ ................................................................33
నిష్కామ కర్మ ఫలం.........................................35
శ్రీ గురుగీత .......................................... .........36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ...... ............................ ...................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

**54) దాసిన చుట్టమా శబరి? దాని దయామతి నేలినావు, నీ**
**దాసుని దాసుడా గుహుడు? తావకదాస్య మొసంగివావు నే**
**జేసిన పాపమో! వినుతి చేసినగావవు గావుమయ్య! నీ**
**దాసులలోన నేనొకడ దాశరథీ కరుణాపయోనిధీ!**

భావం - శబరి నీకు చుట్టమా? కాదే! అయినను ఆమె ఇచ్చిన ఎంగిలిపండ్లను తిని, ఆమెకు మోక్షమొసగితివి. గుహుడు నీ దాసుని దాసుడా? కాదే! అయినను అతనికి నీసేవ చేయు భాగ్యము నిచ్చితివి. నేను ఏ పాపము చేసితినని నను కాపాడకుంటివి? శబరి, గుహుడు నీకు దగ్గర వారైనట్లే నన్ను కూడా నీ చెంత చేర్చుకొనుము.



*ఆచారిగారినుంచి డ్రైవింగ్ శ్రీబాబు ఎందుకు తీసుకున్నారు?
*పరమేశ్వరుని చూచి పార్వతీదేవి ఎందుకు ఆశ్చర్యపోయింది?
*మునులు కూడా దర్శించలేనిదానిని దర్శించినది ఎవరు?
*దొంగ ఘరానావ్యక్తి వేషం ధరించి వచ్చినట్లు మనలోని ఏ గుణం వస్తుంది?
*అద్భుతమైన కమ్యూనికేషన్ స్కిల్ల్ కలవాడు ఎవరు?
*భగవంతుడు, మనము ఒకరికొకరం ఇచ్చిపుచ్చుకునేది ఏమిటి?
*శత్రువుతో కూడా తన పని చేయించుకోగలిగినది ఎవరు?
*కేవలం దేవునిమీద భారం వేసిన పనులు ఎందుకు సిద్ధించవు?
*ఒకరి కర్మఫలం ఇంకొకరు అనుభవించలేనిది ఎందులో?
*రోజూ ఉదయం నిద్ర లేవగానే ఎవరిని స్మరించాలి?
*గురు సుప్రసాదాన్ని ఎందుకు వెంటనే స్వీకరించాలి?

***సమాధానాలు లోపలి పేజీలలో..........................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

18-4-1981

ఈ రోజు ప్రార్థన అయిన తర్వాత శ్రీబాబు వాకింగ్‌కి వచ్చారు. శ్రీబాబూజీ మాట్లాడుతూ "నిన్న మీరంతా శంకరాచార్య సినిమా చూశారనుకుంటాను. మీరు సినిమా చూసి గ్రహించినది పద్మపాదుడు ఆచరించినది ఏమిటి?" అని ప్రశ్నించారు. ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. శ్రీబాబే సమాధానం చెప్పారు.



"పద్మపాదుడు గురువాజ్ఞా పాలన చేసి గురులక్ష్యార్థమునందు మనస్సు నిలపటం వలననే కదా గురుశక్తి అతనిలో ప్రవేశించింది. మీరు చేసింది ఏమిటి? ఆశ్రమంలో ఉండి ఏ చెట్టు క్రిందనో కూర్చొని ధ్యానం చేసుకోకుండా సినిమాకి వెళ్ళి ఏమి సాధిద్దామనుకున్నారు? సినిమాహాలులో చెమట పట్టింది. నల్లులు, దోమలు అవి చేయవలసిన పని చేశాయి. ఇక్కడ సాధించనది అక్కడ ఏమి సాధించారు మీరు? ఈరోజు శ్రీబాబు ఊళ్ళోలేరు కదా! సత్సంగము ఉండదు కదా! భక్తిని ప్రబోధించే సినిమా కదా, చూద్దాం అని వెళ్ళారు కదూ! నేను అక్కడనే ఉన్నాను నన్ను మీరు గుర్తించలేదు. పాపం ఏవో కూల్‌డ్రింక్‌లు కూడా త్రాగారు మీరు. పోనీ ఆ కూల్‌డ్రింకు త్రాగేటప్పుడైనా నన్ను స్మరించారా! నన్ను స్మరిస్తే నాకు చెందేది. అసలు కడుపుమంట అదయ్యా" అన్నారు. శ్రీ బాబు భక్తులందరికీ అరటిపండ్లు ఇచ్చారు. అవి ఆంధ్రప్రభ ఎడిటర్ సుబ్రహ్మణ్యంగారు తెచ్చినవి. ఒక్క పండు మిగిలింది.

శ్రీ సుబ్రహ్మణ్యంగారు మాట్లాడుతూ "ఆ పండు మీరు స్వీకరించండి బాబూ!" అన్నారు.

"ఇంకొక భక్తుడు వస్తున్నాడు ఆయనకి యిద్దాం" అన్నారు శ్రీబాబు.

ఇంతలో శ్రీ నాగేశ్వరరావుగారు వచ్చారు. శ్రీ బాబు ఆ అరటిపండు

ఆయనకి ఇచ్చారు. "సుబ్రహ్మణ్యంగారూ! మీకు పూర్ణ ఆయుర్దాయం అండీ, అందరికి సరిపోయేలా తెచ్చారు అరటిపండ్లు. మీరంతా తింటే నేను తిన్నట్లు కాదా! ప్రసాదం వెంటనే తీసుకోండి. క్రిందపెట్టి మూటకట్టి ఉంచకూడదు. మరుక్షణం మనది కాదు కదా!" అన్నారు శ్రీబాబు.

శ్రీ బాబూజీ రోహిదాసుని కథ చెప్పారు. "రోహిదాసు ప్రతిరోజు భగవానునికి నివేదన చేసిన తర్వాత తాను భుజించేవాడు. రోహిదాసుని భక్తురాలికి ఎలాగైనా ఆ భుక్తశేషాన్ని భుజించాలనే కోరిక కలిగింది. ఒకరోజు రోహిదాసు ఈశ్వరునికి నివేదనచేసి తాను తిని శుభ్రం చేసిన తర్వాత పొరబాటున మిగిలిపోయిన ఒక మెతుకు భక్తురాలికి లభించింది. దానిని ఆవిడ జాగ్రత్తగా భద్రపరచి ఇంటికి తీసుకువెళ్ళి శుచిగా స్నానం చేసిన తర్వాత భుజిద్దామనుకున్నది. ఇంతలో ఒకచీమ ఆ ప్రసాదంలోని అరభాగాన్ని భుజించి ఉత్తమజన్మని పొందింది. ప్రసాదం తెచ్చిన భక్తురాలి తల్లి ఆ మిగిలిన అరభాగాన్ని భుజించి సమాధిస్థితిని పొందింది.

కుమార్తె స్నానం చేసి వచ్చి చూసేసరికి ప్రసాదంలేదు. తల్లి చూస్తే సమాధి స్థితిలో ఉంది. తాను చేసిన పొరపాటుని తెలుసుకుంది. కాని ఆ తర్వాత ఎన్నో జన్మల సాధన తర్వాత మాత్రమే ఆమె తరించింది" అని చెప్పారు. చూశారా! గురుసుప్రసాద మహిమ! గురుసుప్రసాదాన్ని స్వీకరించినవారికి నిరతిశయమైన పరమపదము లభిస్తుంది. అది కేవలం సత్యగురువు మాత్రమే అందించగలుగుతారు. భోక్త గురువు కాదు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జనవరి 2025 :*** AS 2631, 6065, 6146, 7217, 8506, 8508, 8513, 8514, 8515, 8517, 9200, 9275, 9276, 9277, PK 0067, 0069

***ఫిబ్రవరి 2025 :*** AS 8519, 9208, 9278, PK 0070, 0071, 0073, 0075, 0079

## అమ్మ మాట

- జపమాలా ప్రసాద

### సురుచిర బోధన శీలా!

"గురువు రుద్ర స్వరూపం. భోళా శంకరుడంటారు శివుడిని. అలాగే మన గురుమూర్తి శ్రీ బాబూజీ మహరాజ్ వారు కూడా భోళా శంకరుడే. మనతోటే ఆడుతున్నట్టుగా, ఆడిస్తున్నట్టుగా, ఆనందిస్తున్నట్టుగా తిరుగుతున్నట్టుగానే వుండి, తత్వాన్ని ఎంతో సులువుగా అర్థమయ్యేటట్టు, అరటిపండు వొలిచి నోటిలో పెట్టినట్టుగా చెప్పేవారు. అందుకే ఆయన సమర్థ సద్గురు దేవులు. తమ తత్వాన్ని తెలపకుండానే తెలిపారా అన్నట్టు "బ్రహ్మజ్ఞానికి ఒక దానిపైనే ఆశ" అనే చిన్న గీతంలో చెప్పారు స్వామి.



ఆత్మ వస్తువు ఒకదానిపైనే ఆయనకి ఆశ. బ్రహ్మజ్ఞానికి లేదు వినాశము. బ్రహ్మజ్ఞాని వినయపూర్ణుడు, పరోపకారి, నిత్య సంతోషి, బ్రహ్మజ్ఞాని చేయునదంతయు మంచియే. బ్రహ్మజ్ఞానిది సుఫల ఫలము అంటే ఆత్మ ఫలము. బ్రహ్మజ్ఞాని తనలోనికి విషయాదులు ప్రవేశించ కుండా వుండుటకై సదా సదా జాగరూకుడై వుంటాడు. అంతే కాదు బ్రహ్మజ్ఞాని అహంకార త్యాగి. అటువంటి బ్రహ్మజ్ఞాని శ్రీ బాబూజీమహరాజ్.

మీరా, నానక్, జ్ఞానదేవులు, రామకృష్ణ పరమహంస, రామతీర్థ, వివేకానంద వంటి మహాభక్తులు, జ్ఞానులు మన భారతదేశంలో ఎంతోమంది వున్నారు. అట్టి మహాత్ములని మనం రోజుకొక్కసారి మనసారా స్మరిస్తే, వారే బాటలో నడిచారో అదే బాటలే మనమూ నడిస్తే, వారు పొందిన ఆనందమును మనమూ పొందగలుగుతాము.

మానవుడి భక్తిని సిద్ధింపచేయడం కోసం అప్రత్యక్షంగా వున్న మహాదేవుడే గురురూపంలో వస్తారు. అటువంటి మహాత్ముని యేనాడూ కూడా సామాన్య నరుడని యెంచరాదు. సద్గురుమూర్తి మాధవత్వాన్ని సిద్ధింపచేసుకున్న వారు కాబట్టి, వారిని నరుడని యెంచితే కృతార్థత నొందజాలవు. ఈశ్వరుడని నమ్మినావో, అల బ్రహ్మపదార్థ మెరుంగవచ్చు. నీ సరియగు లక్ష్యమొక్కటియె చాలు సాధనలెల్ల గూర్చు. ఈశ్వరుడని నమ్మి భక్తి మనసా గురుపాదములాశ్రయింపుమా" అని చెప్పారు. అట్టి సద్గురుమూర్తి చెప్పినది తు.చ. తప్పకుండా ఆచరించిన నాడు 'ప్రజ్ఞానం బ్రహ్మ' అనే మహా వాక్యానికి నిర్వచనుడిగా చేస్తారు. ఆ గురుమూర్తి యందు అచంచలమైన విశ్వాసం పెంపొందించుకుని, సంకల్పించే మనస్సుని, నిర్ణయించే బుద్ధిని ఆ గురుమూర్తి

పాదాలకి అర్పణ చేసుకుని, గురువాజ్ఞ పాలన చేసిననాడు, వాచ్యార్థంలో జీవుడనబడే వాడు, లక్ష్యార్థాన్ని సాధించి ఈశ్వర శబ్దవాచ్యుడవుతున్నాడు. సత్యగురువుని ఆశ్రయిస్తే, ఏకమయిన వస్తువుని మనలోనే దర్శించగలం. ఏకమయిన వస్తువుని ప్రేమించబట్టే గోపికలు ఈనాటికీ ప్రకాశిస్తున్నారు. మనం కూడా మహాత్ముల వాక్కుని ఆచరిస్తే, వారి లాగానే ప్రకాశిస్తాము. అట్టి సమర్థసద్గురుమూర్తి యొక్క వాక్కు మనకుంది. ఆయన అభయం మనకుంది. కనుక వారు చూపిన బాటననుసరించి అందరూ కూడా బ్రహ్మానందాన్ని అనుభవించి ఆనందించాలి. ఆ సద్గురుమూర్తి కృపావర్షము అందరిపైన సంతతధారగా వర్షించుగాక!

**పరుగు పరుగున వచ్చెడి**
**బాల కృష్ణుడవైనా,**
**పదియారువేల గోపికల చేపట్టిన**
**పావనమూర్తివైనా,**
**పదములను గీతగా మలచిన**
**జగద్గురుడవైనా,**
**పదునాలుగు భువనముల పాలించెడి**
**పరంధాముడవైనా,**
**ప్రీతితో మా యింటిని పావనము చేయ**
**ప్రభువై పలికితివి శ్రీ కాళీప్రసాదుడవై**



- భాగవతుల హనుమత్ జయప్రద

**విజ్ఞప్తి**

***భక్త మహాశయులందరికీ విజ్ఞప్తి! మీకుగాని, మీ కుటుంబ సభ్యులకుగాని, మీ స్నేహితులకుగాని, లేదా మీకు తెలిసిన వారికిగాని శ్రీబాబూజీవారితో కలిగిన అనుభవాలను వ్రాసి పంపించవలసినదిగా ప్రార్థిస్తున్నాము. ఈ వ్యాసములు త్వరలో ఏర్పాటుకానున్న భీమవరం శాఖ ప్రత్యేక సంచిక (సావనీర్)లో గాని, సమర్థ సద్గురు మాసపత్రికలోగాని ప్రచురింపబడును.***

– సంపాదకుడు

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

జనవరి 2025

1 బుధ: ఆంగ్ల సంవత్సరాది. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.
– సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

10 శుక్ర: ముక్కోటి ఏకాదశి. – ఉత్తరద్వార దర్శనం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

13 సోమ: పుష్య పూర్ణిమ, భోగి పండుగ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

14 మంగళ: సంక్రాంతి పండుగ – ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

24 శుక్ర: శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

ఫిబ్రవరి 2025

3 సోమ: వసంత పంచమి – శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్టా దశమ వార్షికోత్సవము (2015 మాఘ శుద్ధ పంచమి) సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

4 మంగళ: రథ సప్తమి – ఉ.6.30 గం.లకు శ్రీ సూర్యనారాయణ మూర్తి పూజ. సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

8 శని : భీష్మ ఏకాదశి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 బుధ: మాఘ పూర్ణిమ. – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

22 శని : శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

26 బుధ: మహాశివరాత్రి – సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

# మేలుకొలుపు

- పాలూరి కాళీప్రసాద్

పూర్వకాలపు కథలలో కానీ, సినిమాలలో కానీ మనం చూస్తే ప్రతి ఇంటిలో ముందుగా ఆ ఇంటి ఇల్లాలు నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, స్నానం చేసి, వంట చేసి అప్పుడు భర్తను మేలుకొలపడం కనిపిస్తుంది. "తరుణి సీతమ్మ తల్లి గృహవిధుల మునిగింది, తిరిగి శయనించేవు మర్యాద కాదయ్యా, మేలుకో శ్రీరామా!" అని మనకు పాట కూడా ఉంది.

అలాగే మన పురాణాలలో గమనిస్తే రాక్షసులు అందరూ కేవలం స్వార్థంతో తమకు శక్తి రావాలనో, మరణం రాకూడదనో వరాల కోసం తీవ్ర తపస్సులు చేశారు కానీ, వారి భార్యలు మాత్రం పతివ్రతలై తమ భర్త బాగు కోసం వ్రతాలు ఆచరించేవారు. వారి పాతివ్రత్య ఫలితంగా ఆ రాక్షసులు అజేయులై నిలిచేవారు. త్రిపురాసురులు, జలంధరుడు వంటి రాక్షసులను మహాదేవుడు సంహరించాలంటే విష్ణుమూర్తి వారి భార్యలను ఏమార్చవలసి వచ్చేది. అందుకు ఆయన శాపాలను కూడా పొందవలసి వచ్చింది. స్త్రీమూర్తుల నిస్వార్థ సాధన యొక్క శక్తి అంతటి గొప్పది.

పూజ, ఆరాధన, సాధన, పుష్ప, హారతి, కీర్తన, నివేదిత, సింధూర, అక్షత ఇలా పూజలకు సంబంధించిన పేర్లన్నీ ఆడ పేర్లే! వాటి ఫలితానికి సంబంధించిన తీర్థ్, ప్రసాద్ మాత్రం మగ పేర్లు. కేవలం నీళ్ళు పోయడం తప్ప ఇంకే కష్టమూ లేని అభిషేక్ మాత్రం మగవారు ఉంచుకున్నారు లెండి! ఇలా పుణ్యకర్మలన్నీ ఆడవారు చేస్తే ఫలితం మాత్రం మగవారు అనుభవిస్తున్నారు. అయితే మన శ్రీకాళీ వనాశ్రమంలోని ఆలయంలో ప్రతిరోజూ ముందుగా శ్రీ రామలింగేశ్వర స్వామివారిని మేల్కొలిపి ఆ తరువాతే జగన్మాత శ్రీ మహా కాళికా పరమేశ్వరీ దేవిని మేల్కొలపడం జరుగుతుంది. అమ్మ ఈ దృశ్యమాన జగత్తుకు ప్రతీక అయితే పరమేశ్వరుడు అందులో కూటస్థుడై జగత్తును నడిపించే చైతన్య స్వరూపుడు. ముందుగా మనలోని చైతన్యం మేల్కొంటేనే కదా ఈ శరీరం నిద్ర లేచేది.

ఈ కాలంలో చాలా కుటుంబాలలో మనుషులు తగ్గి, ఉరుకు పరుగుల జీవనం పెరిగాక స్త్రీపురుషులిద్దరూ ఒకేసారి లేచి, తయారై

పరుగులు పెడుతున్నారు. మన ఆచారాల ప్రకారం పురుషుడు పూజలో, హోమాలో చేసేటప్పుడు స్త్రీ ప్రక్కన లేకపోయినా, "ధర్మపత్నీ సమేతస్య" అని సంకల్పం చెప్పుకోవడం, ఆ పుణ్యకార్యంలో భార్యకు కూడా వాటా రావడం కద్దు. కానీ స్త్రీలు చేసే వ్రతాలు, పూజలు మాత్రం చాలావరకు తమ భర్త, కుటుంబ క్షేమం కోసం, లేదా మంచి భర్త రావడం కోసమో ఉంటాయి.

బాహ్య ప్రాపంచిక ఫలాల కోసం చేసే పుణ్య కార్యాలలో ఇలా ఒకరి కర్మఫలం ఇంకొకరికి పంచడం సాధ్యం అవుతుంది కానీ ఆధ్యాత్మిక సాధనలో మాత్రం ఇలా పంచుకోవడం కుదరదు. ఎవరి సాధన వారిదే. అందులో ఎవరి పురోగతి వారిదే. "**ఉద్ధరేదాత్మనాత్మానం**". ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి. ఉదాహరణకి ఒక తండ్రి కష్టపడి సంపాదించి ఒక యిల్లో పొలమో కొన్నాడనుకోండి అది ఏ కష్టము లేకుండానే అతని కుమారుడికి సంక్రమిస్తుంది కదా! కానీ తండ్రికి ఆకలి వేసి కడుపునిండా భోజనం చేస్తే అది కుమారుడికి సంక్రమిస్తుందా? లేదు! ఎందుకంటే అది బయటి వస్తువు కాదు. ఆకలి తీరడం అనేది ఎవరికి వారికే సొంతమైనది.

మన చిన్నప్పుడు ఒక చాక్లెట్ వ్యాపార ప్రకటనలో పిల్లవాడు అందరినీ "మెలోడీ ఇంత చాక్లెటీ ఎలా అయ్యింది?" అని అడుగుతూ ఉంటాడు. చివరికి వేరొక పిల్లవాడు "మెలోడీ తిను, నువ్వే తెలుసుకో!" అంటాడు. అలాగే ముక్తి కూడా అనుభవైకవేద్యమే కానీ వేరొకరు చెబితేనో, చూస్తేనో, చదివితేనో తెలిసేది కాదు. ఆకలి తీరడం, జ్వరం రావడం మొదలైనవి ఎలా అయితే ఎవరికి వారే అనుభవిస్తారో, ఒకరి అనుభవం ఇంకొకరికి తెలియదో, అలాగే ఆధ్యాత్మిక సాధన ద్వారా పొందే ముక్తి కూడా ఎవరికి వారు పొందవలసిందే, అనుభవించ వలసిందే.

మనం 2024 సంవత్సరానికి స్వస్తి పలికి 2025లో అడుగు పెడుతున్నాం. 2025లో అంకెలన్నీ కూడితే 9 వస్తుంది. అలాగే తొమ్మిది చిల్లుల తిత్తి అయిన ఈ మానవ దేహంలో నుండి ప్రాణవాయువులు జారిపోక ముందే మనం మేల్కొని సాధనలో పురోగతిని సాధించాలని, అటువంటి మేలుకొలుపు మనందరికీ కలిగించాలని శ్రీగురుదేవులను ప్రార్థిస్తూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు!!!

## సుభాషితం - ఆచార్య సద్గుణ

యథా హ్యేకేన  చక్రేణ న రథస్య గతిర్భవేత్

తథాపురుష కారేణ వినా దైవం న సిద్ధ్యతీ

అన్వయ క్రమం – యథా, ఏకేన చక్రేణ, రథస్య, గతిః, న భవేత్, తథా, పురుషకారేణ, వినా, దైవం, న సిద్ధ్యతి.

ప్రతిపదార్థం–

యథా (అవ్యయం)= ఏ విధంగా,

ఏకేన చక్రేణ (1/3)=ఒకే చక్రముతో, రథస్య(1/6) =రథము యొక్క

గతిః (1/1)=గమనము, న భవేత్ (క్రియాపదం, విధి లింగః)=ముందుకు వెళ్ళదు,

తథా( అవ్యయం)=అదేవిధంగా, పురుషకారేణ(1/3)=పురుష ప్రయత్నం

వినా(అవ్యయం)= లేకుండా, (ఏ కార్యము కూడా –అధ్యారోపం)

దైవం(1/2)= దైవము మీద వదిలేస్తే, న సిద్ధ్యతి( క్రియాపదం, లట్)= సిద్ధించదు

Note : 1/3= తృతీయావిభక్తి లో ఏక వచనం

1/6=షష్టి విభక్తి లో ఏకవచనం,

1/1=ప్రథమా విభక్తి లో ఏకవచనం

1/2=ద్వితీయ విభక్తి లో ఏకవచనం

తాత్పర్యం – ఎలా అయితే ఒక్క చక్రముతో రథము ముందుకు వెళ్ళదో, అలానే మనము ప్రయత్నము చేయకుండానే ఏ కార్యము కేవలము దేవుడిని ప్రార్థించినంత మాత్రాన సిద్ధించదు.

వివరణ:- మానవుడు ఎప్పుడూ తన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రయత్నం చేస్తూనే వుండాలి. అలా కాకుండా కేవలము దైవము మీద నమ్మకాన్ని పెట్టి లక్ష్యాన్ని చేరుకుంటాను అని భావిస్తే అది సిద్ధించదు.

ఉదాహరణకు ఒక పిల్లవాడు ఫస్ట్ ర్యాంక్ రావాలనే లక్ష్యముతో ఉన్నాడు అనుకోండి. దానికి అతను భగవంతుడి మీద భారం వేస్తే ఫస్ట్ ర్యాంకు రాదు. అతను ప్రయత్నం చేయాలి. అనగా కష్టపడి  రాత్రి పగలు చదవాలి, దానికి సంబంధించిన ప్రశ్నోత్తరాలన్నీ బాగా అధ్యయనం చేయాలి. ఇలాంటి ప్రయత్నాలు అన్నీ చేస్తేనే అతనికి ఫస్ట్ ర్యాంకు వస్తుంది. అలా కాకుండా కేవలము భగవంతుడి మీద భారం వేసి పరీక్షలను వ్రాస్తే ఫస్ట్ ర్యాంక్ రాదు. దైవ బలముతో పాటు పురుష ప్రయత్నము కూడా ఉండాలి అని ఈ సుభాషితం మనకు చెబుతుంది.

# నేను లేకపోతే!

- భాగవతుల జయప్రద

అశోకవనంలో రావణుడు సీతమ్మ వారి మీదకోపంతో కత్తి దూసి, ఆమెను చంపటానికి ముందుకు వెళ్ళినప్పుడు హనుమంతుడు అనుకున్నాడు 'ఎవరి నుంచైనా కత్తిని తీసుకుని రావణాసురుని తలను ఖండించాలి' అని. కానీ మరుక్షణంలోనే మండోదరి రావణుడి చేతిని పట్టుకొని ఆపడాన్ని చూశాడు! ఆశ్చర్య చకితుడయ్యాడు. "'నేనే కనుక ఇక్కడ లేకపోతే, సీతమ్మను రక్షించే వారెవరు? అనేది నా భ్రమ అన్నమాట" అనుకున్నాడు హనుమంతుడు! సీతామాతను రక్షించే పనిని, ప్రభువు ఏకంగా రావణుని భార్యకు అప్పగించాడు. అప్పుడు హనుమంతుడుకి అర్థమైంది 'ఎవరి ద్వారా ఏ కార్యాన్ని చేయించుకోవాలో వారి ద్వారానే ప్రభువు ఆ పని చేయించుకుంటాడు' అని.

మరింత ముందుకు వెళితే 'త్రిజట' తనకు ఒక కల వచ్చిందని, ఆ కలలో లంకకు ఒక కోతి వస్తుందనీ, అది లంకను కాల్చివేస్తుందనీ, దాన్ని నేను చూశాను అనీ చెప్పింది. అయితే హనుమంతుడికి ఇది చాలా ఆశ్చర్యం అనిపించింది. ఎందుకంటే ప్రభువు తనను సీతను చూసి మాత్రమే రమ్మన్నాడు, అంతేకానీ లంకను కాల్చి రమ్మని చెప్పలేదు. తాను లంకను కాల్చడం ఎలా సాధ్యం? అని అనుకున్నాడు. అయితే త్రిజట ఇది తన స్వప్నంలో చూశాను అని చెప్పింది. హనుమంతుడు ధర్మ మీమాంసలో పడ్డాడు. తను ఇప్పుడు ఏం చేయాలి? సరే, ప్రభువు సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది అనుకున్నాడు.

హనుమంతుని చంపడానికి రావణుడి సైనికులు పరిగెత్తుకొని వస్తున్నప్పుడు హనుమంతుడు ఏమి చేయలేదు. అలా నిలబడ్డాడు. అయితే ఆ సమయంలో విభీషణుడు వచ్చి 'అన్నా! దూతను చంపటం నీతి కాదు' అన్నాడు. అప్పుడు హనుమంతునికి అర్థమైంది, తనను రక్షించే భారం ప్రభువు విభీషణునిపై ఉంచాడు అని.

ఆశ్చర్యానికి పరాకాష్ట ఎక్కడంటే విభీషణుడు ఆ మాట చెప్పగానే రావణుడు ఒప్పుకుని 'కోతిని చంపొద్దు. కోతులకు తోకంటే మహా ఇష్టం తోకకు నిప్పు పెట్టండి' అన్నాడు. అప్పుడు హనుమంతుడికి మరింతగా అర్థమైంది త్రిజట స్వప్నం నిజం కాబోతుంది అని. "ప్రభువు నాకే చెప్పి ఉంటే... నేను ఎక్కడి నుంచి నూనె తీసుకురావాలి, ఎక్కడి నుంచి గుడ్డలు తీసుకురావాలి, ఎక్కడి నుంచి నిప్పు తీసుకురావాలి, ఎప్పుడు లంకను తగలబెట్టాలి! ఆలోచనల పరంపరతో ఆశ్చర్యంలో మునిగిపోయాడు. పరమాశ్చర్యం ఏంటంటే, వాటన్నిటికి ఏర్పాట్లు రావణుడే స్వయంగా చేయించాడు.

అంటే, రావణునితో కూడా తన పనిని చేయించుకోగలిగిన తన ప్రభువు, తనకు 'లంకను చూసి రా' అని మాత్రమే ఆజ్ఞాపించడంలో ఆశ్చర్యం ఏముంది!

బహుశా మనం కూడా ఎన్నోసార్లు ఇలానే అనుకుని ఉంటాం, 'నేను లేకపోతే ఎలా?' అని. నేను లేకపోతే ఈ సేవ జరుగదు ఏమో, పూజ, లేదా ఈ కార్యము జరుగదు ఏమో అని. ప్రపంచంలో జరుగుతున్నదంతా శ్రీ గురుదేవుల అనుగ్రహం వల్లనే జరుగుతున్నది అని, మనమంతా కేవలం నిమిత్తమాత్రులం అని ఎవరైతే అర్థం చేసుకుంటారో వారికి ఈ 'నేను' అనేది అంటదు. ఆంజనేయుడు స్వామి భక్తి పరాయణుడు. దాస్య భక్తికి నిలువెత్తు నిదర్శనము. శ్రీ సీతారాంజనేయ సంవాదములో ఆంజనేయుడు

**దేహ బుధ్యాతు దాసోహం జీవ బుద్ధ్వా త్వదంశకః**

**ఆత్మ బుద్ధ్వా త్వమేవాహం ఇతి మే నిశ్చితా మతిః**

అంటే, నన్ను నేను శరీరంతో అనుసంధానం చేసుకున్నప్పుడు, నేను నీ దాసుడ్ని, నన్ను నేను జీవుడిని అని భావించినప్పుడు, నేను నీలో భాగాన్ని (నీ అంశ ), కాని నన్ను నేను ఆత్మగా చూడగలిగినపుడు, నేను నీతో ఒకటిగా ఉన్నాను అని అంటారు.

మొదటిది 'ద్వైతము', రెండవది 'విశిష్టాద్వైతము', మూడవది 'అద్వైతము' అయినది ఇక్కడ. అంటే దేహబుద్ధి కలిగిన వారు అందరు దాసులు అనేటువంటి సూచన మనకి చేశారు. శ్రీ గురుదేవులు తమయొక్క బోధామృతములో ఎన్నోసార్లు ప్రబోధించారు, కులశేఖరులు ఎంతటి దాస్య భావనతో ప్రార్థించారు అని,

**మజ్జన్మనః ఫలమిదం మధు-కైటభారే మత్-ప్రార్థనీయ-మదనుగ్రహ ఏష ఏవ**

**త్వద్భృత్య-భృత్య-పరిచారక-భృత్య-భృత్య భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ**

(ముకుంద మాల)

దాస్యము చేస్తే వచ్చేది 'సోహ భావన'. "సోహం" అనేటువంటి "జ్ఞానాన్ని" ఇచ్చేది "దాసోహం". అందువలన, నేను లేకపోతే ఏదీ జరగదు అనే అహంభావన విడిచి, శ్రీ గురుదేవుల యొక్క సేవ (అంకిత భావము,నిస్వార్థముతో) చేసుకోవడమే మనకు పరమావధి. స్వామిని స్మరించటం, స్వామిని ప్రేమించడం, మరియు స్వామి కోసం జీవించడం మనకు అత్యంత మంగళకరం. స్వామి కృపతో ఆయన ధ్యానంలో మన మనస్సును కేంద్రీకరించి, ఆత్మానందాన్ని పొందడమే మన జీవితమునకు సార్థకత.

# మాయ - పెనుమాక నాగేశ్వరరావు

మాయ  మాయ మాయ ! ప్రపంచం అంతా మాయ. అందుకే మాయాప్రపంచం అనే మాట ప్రచారంలోకి వచ్చిందనవచ్చు. పిల్లల్ని పెద్దవాళ్ళు మాయ చేసి మారాం ఆపగలుగుతారు. అయితే ఆ పిల్లలకీ కొంచెం అనుమానం వస్తుంది... ఏమనంటే వీళ్ళు చెప్పేది నిజమేనా? అని కానీ అంతకన్న చేసేది ఏమీ లేక మాయలో పడినట్లు నటిస్తారు. అదో పెద్ద మాయ. మనం మాయ చేస్తున్నట్లు వాళ్ళకి తెలియదను కోవటం కూడా మనం మాయలో ఉండబట్టే. కాబట్టి అంతా మాయే.

మాయ కల్పించింది మాధవుడు. ఆ మాయలో పడకుండా తప్పించుకుని మోక్షం పొందటం మానవుడి పని! అయ్యే పనేనా! మామూలు మనుషులు కల్పించే మాయలో పడితేనే తేరుకోవటం కష్టం. అలాంటిది సాక్షాత్తూ భగవానుడి మాయలో నుండి తప్పించుకోవటం సాధ్యమా? సాధ్యమే అని చెబుతున్నారు పెద్దలు, విజ్ఞులు. ఎలా అంటే నన్ను ఈ మాయ నుండి తప్పించు స్వామీ అని భక్తితో, ఆర్తితో, చిత్త శుద్ధితో ఆయన్నే శరణుకోరడం ద్వారా అని మార్గం కూడా చెబుతున్నారు. అంటే ఆ ఆర్తి, భక్తి, శక్తి, చిత్తశుద్ధి మనకి ఉండాలని అర్థం అవుతున్నది.

ఇక్కడే మాయ చేయటానికి, మోసం చేయటానికి తేడా ఏమైనా ఉందా, లేక రెండూ ఒకటేనా అనే సందేహం వస్తుంది. అయితే లౌకిక విషయాల్లో, మాయ చేసిన తరువాత మోసం చేయటం జరుగుతుంటుంది. మాయ చేయటం అంటే నమ్మకం కలిగించటం. ఆ కారణం చేతనే నమ్మించి మోసం చేశారు అంటుంటాం. కానీ భగవంతుని మాయలో నమ్మించటం ఏం ఉండదు. నిజానికి నమ్మించకపోవటమే ఆయన మాయ. అందుకేగా కలడు కలండనువాడు కలడో లేడో అనే సందేహం కలిగించాడు పరమ భాగవతోత్తముడికి కూడా!

ఎవడైనా భగవంతుడితో తన గోడు వినిపించుకోవాలనుకుని "ఏమిటయ్యా నాకీ కష్టాలు, నిన్నే నమ్ముకున్నాను. నిన్నే భజిస్తున్నాను. నిన్నే స్తుతిస్తున్నాను. అయినా నాకెందుకు ఇన్ని కష్టాలు కలిగిస్తున్నావు?" అని వాపోయే వారికి ఏం చెబుతున్నాడు? ఇందులో నా ప్రమేయం ఏం లేదు. నీ పూర్వజన్మ కర్మలే నువ్వు అనుభవిస్తున్నావు. నేను నిమిత్త

మాత్రుడ్ని అంటున్నాడు. ఈ నాదేమీ లేదు అనటమే మాయ. అన్నింటికీ నీవే నీవే అని చెబుతూనే నేను అనేది వదిలెయ్యమంటున్నాడు మనల్ని. అదే విచిత్రం. అదే మాయ. జరిగేవాటన్నింటికీ మనల్నే బాధ్యుల్ని చేస్తూ, తన ప్రమేయం ఏమీ లేదని చెబుతూ, తనని ఆశ్రయించిన వారికి భయం లేదంటూ అభయం ఇస్తున్నాడు అదే మాయ.

శరణం అన్నవారికి కూడా నువ్వు ఏది అడిగితే అది ఇవ్వను. నీకు ఏది కావాలో అది ఇస్తాను. నువ్వు ఎప్పుడు అడిగితే అప్పుడు ఇవ్వను. ఎప్పుడు ఇవ్వాలో నాకు తెలుసు. అప్పుడే ఇస్తాను. కాబట్టి నీకు ఏది ఎప్పుడు ఇవ్వాలో నాకన్నా తెలిసినవాళ్ళు ఇంకోళ్ళు లేరు. అంటున్నాడు. సరే అలాగే ఇవ్వు. కానీ ఇంకెందుకు నిన్ను శరణు కోరాలి. కోరినవారికీ, కోరని వారికీ అందరికీ నువ్వేగా ఇవ్వాలి. అని ఎవడైనా అంటే, సరే అడగకుండా ఉండు ఇస్తా అంటున్నాడు భగవంతుడు. కానీ మనం వుండలేమే! అదే మాయ. ఆ మాయా ప్రపంచంలో నుంచి బయట పడటం సులభం కాదు.

మనిషికి కోరికలు లేకపోతే భగవంతుడితో పనేం ఉంటుంది? మనిషికి ఆశలు లేకపోతే దేవుడితో పనేం ఉంటుంది. మానవుడికి కష్టాలు లేకపోతే మాధవునితో పనేం ఉంటుంది? అంటే ఆయన వునికి కోసం ఇవన్నీ కల్పించాడా? అని మరో సందేహం కలిగి తీరుతుంది. ఇలాంటి సందేహాలు కలగటం కూడా ఆయన మాయలో భాగమే. అయితే మనం ఆయన మాయలో పడకుండా ఉండలేము. పడిన తరువాత మనంతట మనమే బయటపడలేము. ఇదీ భగవంతుడి మాయ లోని మర్మం అని నేను అనుకుంటున్నాను.

ఇంతకూ అసలు విషయం ఏమిటంటే, ఆయన మహా మాయగాడే గానీ మనం మాత్రం తక్కువా! మనం అంత వెర్రివాళ్ళం కాదు (ఇది మహా మాయ). అసలు నిజం చెప్పాలంటే ఆయన ఇస్తున్నాడు కాబట్టే మనం వస్తున్నాం. ఏమిస్తున్నాడంటే, మనక్కావలసిందే ఇస్తున్నాడు. ఏతావాతా ఇస్తున్నాడు కాబట్టే వస్తున్నాం, వస్తున్నాం కాబట్టే ఇస్తున్నాడు. ఆయనా ఇస్తున్నాడు, మనమూ ఇస్తున్నాం, ఏమిటంటారా ప్రేమ. అవును మనం ఆయన్ను ప్రేమిస్తున్నాం, ఆయన మనకు ప్రేమను అందిస్తున్నాడు. ఏమిస్తావో, ఎంత ఇస్తావో, ఎప్పుడు ఇస్తావో నీ ఇష్టం.

మాకు పరీక్షలు వద్దు. పర్యవేక్షించు చాలు. నీ రక్షణలో (కవరేజ్ ఏరియా)లో మమ్మల్ని ఉండనీయి చాలు. అమాయకంగా ఏవేవో అడిగేస్తుంటాం. అనునయించు. క్షమించు. నీ మాయలోనే ఉండనీయి. నీ నీడలోనే ఉండనీయి. అంతే చాలు. అదే పదివేలు.

ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన మాయలోడు, మనం ఆయన్ని వదలని మొండోళ్ళం, అందుకే మంచోళ్ళం. తావేది లేదు లేదు లేదింక మాకు మరు జన్మకు, మరచి మనలేము తరలి పోలేము మరు జన్మకు తరచి అనలేము వదిలి  పోలేము మరో జన్మకు, దయచేసి దారి మూసేయి మాకు పునర్జన్మకు!

**పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశములు**

**జనవరి 2025 లో ..........................................**

17, 18, 19 తేదీలలో ....................... భీమవరం

20వ,  తేదీ ................... ................సాధుపరిషత్, దేవరపల్లి

21, 22, 23 తేదీలలో ................... ...చిన్న మంగళా పురం.

24వ తేదీ ................. ......................రేగిడి

25వ తేదీ ..........................  ............దివ్య జీవన సంఘము, పలాస.

27వ తేదీ .............. శ్రీనివాస మంగాపురము, శ్రీవశిష్ఠాశ్రమ రజతోత్సవములు.

**జనవరి 30 నుండి ఫిబ్రవరి 3 వరకు, మరియు 4వ తేదీ రథసప్తమి సందర్భంగా, శ్రీసద్గురుపాదపూజ, మరియు సూర్యనారాయణమూర్తి పూజలతో ....హైదరాబాద్‌లో సత్సంగములు  ముగుస్తాయి.**

**ఫిబ్రవరి 2025 లో .......................................**

8 నుండి 12 వరకు .......................పెద నింద్రకొలనులో సత్సంగములు

19 నుండి 23 వరకు .................... గుండుగొలనులో సత్సంగములు

# హనుమత్తత్వం

- ప్రసాదవర్మ కామఋషి

దూరీకృత సీతార్తి। ప్రకటీకృత రామ వైభవ స్ఫూర్తి।
దారిత దశముఖ కీర్తి। పురతో మమ భాతు హనుమతో మూర్తి॥

– అని శంకర భగవత్పాదులచే కీర్తింపబడిన మహనీయుడు హనుమ. వాల్మీకి మహర్షి నారదుని ప్రోత్సాహంతో శ్రీమద్రామాయణం అనే మహేతిహాసాన్ని ఆవిర్భవింపచేశాడు. ఈ అపురూప కృతి ఆధ్యాత్మికంగా ఎంత ప్రాధాన్యత సంతరించుకున్నదో సాహిత్య పరంగా కూడా అంత ఉన్నత స్థానం పొందినది. ఈ మహా కావ్యంలో ప్రముఖమై, రామాయణ మహామాలా రత్నం అని కీర్తించ బడిన పాత్ర శ్రీ హనుమాన్. బాల, అయోధ్య, అరణ్య కాండలలో ఈయన ప్రస్తావన లేదు. కిష్కింధలో దర్శనమిచ్చి, రామ పట్టాభిషేక పర్యంతం తన వెంట తిప్పుకుంటాడు. హనుమదారాధన అంటే భక్తి ప్రపత్తులను, సేవాభావాన్ని, శక్తి సద్గుణాలను ఆరాధించటమే. హనుమ అనేది ఒక దివ్యనామం, ఒక మహామంత్రం, దాస్యభక్తికి నిలువెత్తు నిదర్శనం.

హనుమంతుని ప్రభుభక్తి, దౌత్యకౌశలం,వాగ్వైభవం, బలపరాక్రమాలు,శక్తి యుక్తులు సుందర కాండ లో విపులంగా ఆవిష్కరింప బడ్డాయి. కిష్కింద, యుద్ధ కాండలలో కూడా హనుమంతుని వ్యక్తిత్వాన్ని విశదపరచు సన్నివేశాలెన్నో కానవస్తాయి. జాంబవంతుడు హనుమ బలపరాక్రమాలు గుర్తు చేయగా రామ కార్యమునకు ఉద్యుక్తుడై కృతకృత్యుడైనాడు. అయితే ఈ కార్యము తాను చేయుచున్నాను అని భావింపలేదు. రాముడే తనచే చేయిస్తున్నాడని హనుమ విశ్వాసం. ఇదియే కదా గొప్ప కర్మయోగము.

సముద్రగమన సందర్భంలో మైనాకుడు తన ఆతిధ్యాన్ని స్వీకరింపమని ఆహ్వానిస్తే, ఆగకుండా ముందుకు సాగి, విధి నిర్వహణలో వున్న దూత ఆతిధ్యాలతో కాలహరణం చెయ్యరాదన్న సందేశాన్ని ఇచ్చాడు. నాగమాత అయిన సురస భయంకర రాక్షసరూపంలో ఎదురై, నా నోటిలో ప్రవేశించకుండా ముందుకు సాగలేవు అని ఆటంక పరచాలని ప్రయత్నిస్తే, తన శరీరాన్ని చిన్నదిగా చేసి, ఆమె నోటిలో ప్రవేశించి, మరుక్షణం బైటకు వచ్చి బుద్ధి కుశలత ప్రదర్శించాడు. సురస ఆశీర్వాదాలనూ పొందాడు. సముద్ర లంఘనానికి పూనుకొనుటలో ధైర్యం, మైనాకుని ఆతిథ్యం తిరస్కరించటంలో – కార్య దీక్ష, సురసను తృప్తి పరచటంలో బుద్ధి వైభవం, ఈ లక్షణములున్న సాధకునికి విజయమే కాని వైఫల్యం ఉండదు.

లంకనుంచి తిరిగివస్తూ, ఆవలి తీరంలో ఉత్సుకతతో ఎదురుచూస్తున్న జాంబవాదులకు 'సీతను చూసితిని' అన్న వార్త ముందుగా చెప్పేడు. దారిలో జరిగిన

సంఘటనలు, లంకలో చూసిన విశేషాలు తన విజయాలు తరువాత చెప్పాడు. కిష్కింధలో రామ లక్ష్మణ సుగ్రీవాదుల వద్ద స్వీయ సాహస గాథలు మూడు ముక్కల్లో ముగించి, సీతా సందేశాన్ని వివరంగా వినిపించాడు. అదీ హనుమంతుని 'ధీ' విశేషం.

హనుమద్ వాగ్వైభవం: వివిధ శాస్త్రాలను చతుర్వేదాలను, నవ వ్యాకరణాలను అధ్యయనం చేసిన ఆచార్యుడు. ఈ వాక్య కుశలుని రాజనీతి చతురత, వాక్చాతుర్యం అద్భుతమైనవి. ఈ విషయం రామ, లక్ష్మణ, రావణాదులతో చేసిన సంభాషణలలోను, విభీషణ శరణాగతి సందర్భంలోను తేటతెల్లమవుతుంది. ఈనాటి పరిభాషలో చెప్పాలంటే అద్భుతమైన *కమ్యూనికేషన్ స్కిల్స్ కలవాడు హనుమ.*

రామలక్ష్మణులు సీతను అన్వేషిస్తూ పంపా తీరానికి వచ్చారు. సుగ్రీవుడు తనకు హాని చేయుటకై శత్రువు లెవరో వచ్చారని భావించి, వారెవరో తెలుసుకొని రమ్మని హనుమంతుని పంపుతాడు. మా రాజు సుగ్రీవుడు పంపగా వచ్చాను, నేను అతని మంత్రిని, నాపేరు హనుమంతుడు, మారాజు మీతో మైత్రిని కోరుచున్నాడు అని చెప్పాడు. రాముని చూడగానే దశరథపుత్రునిగా కాక పరమాత్మయే అని గుర్తించాడు హనుమ.

"సౌమిత్రీ - హనుమతో మాట్లాడుము, ఋగ్వేదం చదవని వాడు, యజుర్వేదాన్ని ధారణ చెయ్యని వాడు, సామ వేద పరిజ్ఞానం లేనివాడు ఇంత అందంగా మాట్లాడలేడు. యితడు వ్యాకరణాన్ని అనేకసార్లు అధ్యయనం చేసినట్లుంది. ఇందుచేతనే ఇంతసేపు మాట్లాడినా ఒక్క అపశబ్దం కూడా దొర్లలేదు. అవిస్తరం, అసందిగ్ధం, అవిలంబితం, అవ్యథం, చెప్ప వలసిన విషయాన్ని క్లుప్తంగా కొద్ది మాటల్లోనే స్పష్టంగా ప్రకటించాడు. మాట్లాడేటప్పుడు కనులు, నుదురు, ఇతర అంగములను హావభావ ప్రకటనకు అనుగుణంగా సంచలింప చేస్తూ ప్రసంగించాడు. తొందరగా కాని మెల్లగా కాని మాటలాడక, మధ్యమ స్వరంలో పలికినాడు. సంస్కార సంపన్నమై అనర్ఘళ ధారా ప్రవాహంలా ఉన్న వాణి అతనిది. ఇతడి మాటలు విన్న ఎవరి హృదయమైనా ప్రసన్నమై కార్యసిద్ధి కలుగుతుంది" అంటాడు శ్రీరాముడు. రామకథ మొత్తంలో రాముని నోట ఇంతటి ప్రశంస ఏ పాత్రకూ దక్క లేదు. ఈవిధంగా శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠుడు అగు ఆచార్యుడు హనుమలో మనకు దర్శనమిస్తాడు.

వేదవేదాంగములను అధ్యయనం చేసి దాని అర్థము తెలుసుకున్నవాడు శ్రోత్రియుడు, ఎల్లపుడు భగవదనుభవమును నిలుపుకొన్నవాడు బ్రహ్మనిష్ఠుడు.

- సశేషం

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

## ప్రథమోధ్యాయము - అర్జున విషాదయోగము

నిజానికి అంతకు ఒక్కక్షణం ముందువరకు, అర్జునుడికి తన లక్ష్యం ఏమిటో బాగా స్పష్టంగా తెలుసు. ఆ లక్ష్యసాధన కోసం, స్వధర్మాన్ని నిర్వర్తించటానికే అర్జునుడు రణరంగానికి వచ్చాడు. కాని ఎప్పుడైతే కురువీరులందరూ, బంధువులుగా, స్వజనంగా కనిపించారో, అప్పుడే అర్జునుడిలో దాగివున్న ఆసక్తి మేలుకొనటం, అతడు పరాక్రపతో నిండిపోవటం జరిగింది. ఈ ఆసక్తి పరాక్రప వేషంలో బయటపడటం ఎలా



ఉంటుంది అంటే, ఒక దొంగ, ఘరానా వ్యక్తి వేషం ధరించి వచ్చినట్లు ఉంటుంది. అందువలన, మామూలు దొంగను గుర్తుపట్టినట్లుగా, ఈ దొంగను కనుక్కోలేవు. మారువేషంలో ఉన్న ఈ దొంగను గుర్తించటం చాలా కష్టం.

ఒక విధంగా నీ జీవితంలో నీకు కూడ ఇలాంటి పరిస్థితులే తారసిల్లుతాయి. ఆత్మానుభూతిని పొందటానికి సాధన మొదలుపెడితే, తల్లి తండ్రుల పట్ల, భార్యాపుత్రుల పట్ల నిర్వహించవలసిన విధ్యుక్త ధర్మం రూపంలోనో, లేదా అటువంటిదే వేరే ఏదైనా ధర్మసంకటంలోనో నిన్ను పడవేసే పరిస్థితులు కనిపిస్తూ, ఆ ఆసక్తి అడ్డం వస్తుంది. అటువంటి పరిస్థితులు జీవితంలో ఎదురైనపుడు నీవు కూడా సరిగ్గా అర్జునుడు ప్రవర్తించినట్లుగానే ప్రవర్తిస్తావు.

అర్జునుడి మనస్సులో చెలరేగుతున్న తుఫాను అతనిలో ఆత్మానుభూతిని పొందాలి అన్న ఆకాంక్షకు, అహంకార, మమకార రూపము అయిన ఆసక్తికి మధ్య జరుగుతున్న సంఘర్షణ వల్ల కలిగింది.

- సశేషం


మోత బరువు
ముకుంద్
పదండి తీర్థ యాత్ర చేద్దాం!
1
నేను స్త్రీని తాకడం పాపం కదా!
కాపాడండి!
2


3


4


నేను వద్ధనుకుంటే గురువుగారు కన్యను తాకి పాపం చేశారు. ఆయన పాపి గానే లెక్కకదా!
5


అంత పెద్ధ పాపం చేసినందుకు ఆయన సన్యాసి కారు కదా! అడిగి చూద్ధాం!
6


గురువుగారు! స్త్రీని తాకడం పాపం కదా! మరి మీరు ఆ కన్యను తాకి పాపం చేశారు కదా!
7


నాయనా! నేను ఆ స్త్రీని 10నిమిషాలే తాకాను. అది కూడా ఆమెను కాపాడటానికే. కానీ నువ్వు ఇప్పటి దాకా ఆమెను మానసికంగా మోస్తూనే ఉన్నావు కాబట్టి ఎవరిది పాపం?
8

# బిల్వదళం - మోక్షఫలం

సేకరణ - మురళీ

మహాత్ముల అవతార ఉద్దేశం ఏమైనప్పటికీ వేలాది మంది తరించడం దానికి అవాంతర ప్రయోజనమై ఉంటుంది. గంగ భగీరథుని పితరులను తరింపచేయడనికి వచ్చినా ఇప్పటికి ఎన్ని తరాలుగా ఎంత మందిని తరింపజేస్తోంది!

కంచి పరమాచార్య మహాస్వామి వారు 1935 ప్రాంతాలలో కాశీ యాత్రకు వెళుతున్నప్పటి సంఘటన ఇది...

స్వామివారు కర్నూలు దాటి చిన్నచిన్న గ్రామాల గుండా శ్రీశైలం వైపు తమ పరివారంతో ప్రయాణం చేస్తున్నారు. రోడ్డునకు కొంచెం లోపలగా ఉన్న గ్రామపు జమీందారు, తమ గ్రామస్థులందరితో కూడి పూర్ణకుంభంతో నుంచుని ఉన్నాడు. ముందు మఠ నిర్వహణ వారు ఏర్పాటు చేసినట్లు స్వామివారు మరికొంచెం దూరం వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న గ్రామంలో బస చేయవలసి ఉన్నది. కానీ జమీందారుతో కూడిన గ్రామస్థులందరూ శ్రీవారు తమ గ్రామాన్ని పావనం చేసి అక్కడ బస చేయాలని ప్రార్థించారు.

జమీందారుగారు ఊరిలో ఒక చెరువు, దాని ఒడ్డున సత్రం ఉన్నాయని, శ్రీవారి బసకు, పూజకు, పరిచారికులకు సౌకర్యంగా వుంటుందనీ వివరించాడు. ఏదో ఒకటి రెండు రోజులు ఉండి పోదాము అనుకున్న స్వామివారు రమణీయమైన పరిసరాల మధ్యనున్న గ్రామం, ఆ గ్రామస్థుల భక్తి చూసి అక్కడ కొంత కాలం ఉండటానికి ఒప్పుకున్నారు. అంతే! గ్రామస్తులందరూ కలిసి కావలసిన పందిళ్ళు, పాకలు వేయించడం లోను, సంబారములు సమకూర్చడంలోనూ నిమగ్నమైనారు.

మరునాటి ఉదయం చంద్రమౌళీశ్వర పూజకి కావలసిన వస్తువులన్నీ సమకూర్చబడినాయి. కాని చంద్రమౌళీశ్వర పూజకి కావలసిన బిల్వదళాలు మాత్రం రాలేదు. ఆ గ్రామస్తులకు మారేడు దళాలు అంటే ఏమిటో తెలియలేదు. ఉన్న ఒకటి రెండు బ్రాహ్మణ కుటుంబాల వారు కూడా బిల్వదళాలు ఈ చుట్టుపక్కల లేవు అని తేల్చి చెప్పారు. పూజకు సంబంధించిన సంబారాలు చూచే మఠోద్యోగులకు ఏమి చేయాలో తోచలేదు.

ఇంతలో స్వామివారు స్నానం చేసి వచ్చి అనుష్ఠానం ఆచరించ బోతూ "బిల్వదళాలేవి?" అని అడగనే అడిగారు. పరిచారకులు "ఇక్కడ బిల్వదళాలు ఎరిగినవారే లేరట" అని చెప్పారు. స్వామివారు చిరునవ్వు నవ్వి గోశాల వెనకనున్న బండరాయి పైన కూర్చుని అనుష్ఠానం ఆరంభించారు. పరిచారకులు నిర్మాల్యంలో ఉన్న బిల్వదళాలను చూపి ఊరి యువకులని వాటిని వెతుక్కుని రమ్మని పంపారు.

స్వామివారి ఒక గంట జపం ముగిసి కనులు తెరిచారు. జనం కుడా ఆత్రుతగా బ్రహ్మానుభవంలో ఓలలాడే ఆ పరమాత్మ వంక చూస్తున్నారు. స్వామివారు బిల్వదళాల లేమికై ఏమి చెప్పబోతారో? తాము ఉందామనుకొన్నన్ని రోజులు ఉండకుండానే వెళ్ళిపోతారేమోనని కలత పడుతున్నారు. ఇంతలో శ్రీమఠం పరిచారకులలో ఒకరు ఎంతో ఆనందంతో బిల్వదళాలు పట్టుకువస్తూ పందిరి వద్ద కనిపించారు. అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

స్వామివారు బిల్వదళాలు చేతిలోకి తీసుకుని పరీక్షించారు. "ఈ చుట్టుపక్కల మారేడు చెట్లే లేవన్నారే? ఈ దళాలు ఎక్కడ నుంచి వచ్చాయి. అన్నీ నవనవలాడుతూ కోమలంగా మూడు మూడు ఆకులతో ఉత్తమంగా ఉన్నాయి. ఎవరు కోశారు? ఎక్కడ నుండి వచ్చాయి?" అని అడిగారు. బుట్ట తీసుకువచ్చిన పరిచారికుడు నేను యాధృచ్ఛికంగా అటుపక్క వెళ్ళినపుడు పందిరి గుంజ పక్కన ఈ బుట్ట పెట్టి ఉన్నది స్వామి. ఎవరు తెచ్చారో చుడలేదన్నాడు. "ఎవరు ఇక్కడ పెట్టారని నీవడగలేదా?" అన్నారు స్వామివారు.

"అడిగాను కానీ ఎవరూ తమకు తెలియదంటున్నారు" అన్నాడు పరిచారికుడు. "మరెవరు తెచ్చి ఉంటారు? చంద్రమౌళీశ్వరుడే తన పూజకు తానే బిల్వములను తెప్పించుకున్నాడ"ని నవ్వుతూ పూజకు వెళ్ళారు స్వామివారు. ఆరోజు కార్యక్రమాల వత్తిడిలో బిల్వదళాల గురించి మళ్ళీ ఎవరూ ఆలోచించలేదు.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 19: నారదస్తు తదర్పితాఖిలాచరితా తద్విస్మరణే పరమ వ్యాకుల తేతి**

తాత్పర్యము: నారదుల ప్రకారము సమస్త కర్మలను భగవదర్పితముగా సమర్పించుట మరియు విస్మృతి కలిగినప్పుడు పరమ వ్యాకులత చెందుటయే భక్తి అని నిర్వచింపబడుతుంది.



నారదుల వారు ఈ సూత్రము ద్వారా సర్వ కర్మలను భగవదర్పణముగా చేయుటయే భక్తి అనీ నిజమైన భక్తుడు భగవంతుని యెడల విస్మృతిని ఒక క్షణకాలమైనా భరించజాలడని వివరిస్తున్నారు. అయితే ముందు వివరించినట్లు వ్యాసులవారు గర్గాచార్యులు శాండిల్యులు చెప్పిన కాయిక, వాచిక, మానసిక భక్తి నిర్వచనాలతో నారదులవారు విభేదించడం లేదని గమనించాలి. అంతేగాక ఆ సూత్రాలను బలపరిచే విధంగా సంపూర్ణ భక్తికి ఉండే లక్షణాలను ఈ సూత్రము ద్వారా నారదులు వివరిస్తున్నారు.

సర్వ లౌకిక వైదిక వ్యాపారములను భగవంతునికి మాత్రమే అర్పించి తనకు ప్రీతిపాత్రమైన గురుదేవులయందు అఖండమైన అనురక్తి కలిగి ఉండడమే భక్తికి నిర్వచనం అని ఈ సూత్రం యొక్క సారాంశం. ఇదే విషయమును శ్రీ బాబూజీ మహారాజ్ తమ బోధలలో వివరిస్తూ సాధకుడు ఒక చేతితో సద్గురుదేవుల పాదములు పట్టుకుని రెండవ చేతితో తన విధులను నిర్వర్తించుకొని తిరిగి మరొక చేతిని కూడా రెండవ పాదం మీదకు చేర్చాలి అని వివరిస్తూ ఏ పనిని నిర్వర్తిస్తున్నా నిరంతరం తన గురుదేవులయందు మనసు నిలపాలన్న సందేశమును అందించారు. గీతాచార్యులు కూడా భగవద్గీతలో "**సర్వేషు కాలేషు మాం అనుస్మర - యుద్ధ్యచ**" అంటూ నామస్మరణను సర్వకాల సర్వావస్థలయందు ఎన్నటికీ మరువరాదని తెలియచేశారు.

అన్ని కర్మలను భగవంతునికి అర్పించిన సాధకుడు అదే స్మరణలో ఉన్నప్పుడు ఆ కర్మాచరణ కూడా చివరికి స్వామివారి ఆరాధనయే అవుతుంది. "**యద్యత్ కర్మ కరోమి తత్తదఖిలం స్వామీ తవారాధనమ్**" అని మనము పూజానంతరము చెప్పుకునే మంత్రము యొక్క అంతరార్థము అదే కదా!

**భక్తి సూత్రము 20: అస్త్యేవమేవమ్**

తాత్పర్యము: అది అట్లే. యుక్తమే. (ముందు వివరించిన అన్ని సూత్రములు సరియైనవే)

ఈ సూత్రము ద్వారా నారదులు ముందు వివరించిన భక్తి నిర్వచనములు నిజమే అని

నొక్కి వొక్కాణిస్తున్నారు. అంతేకాక "ఏవం ఏవం" అంటూ భక్తి నిర్వచనం పలు రకాలుగా ఉంటుందని ఆచరించే విధానాలను బట్టి వాటి లక్షణాలు ఉంటాయని తెలియ చేస్తున్నారు. మరి సంపూర్ణ భక్తి గురించి నారదుల వారు వివరించిన వివరణ యుక్తమే అనడానికి ముఖ్యమైన ఉదాహరణను తదుపరి సూత్రములో మనకు సెలవిస్తారు.

**భక్తి సూత్రము 21: యథా వ్రజ గోపికానామ్**

తాత్పర్యము: నందవ్రజములోని గోపికల యొక్క భక్తి వలే. ఈ సూత్రము ద్వారా నారదులు సంపూర్ణ భక్తికి ఉదాహరణగా గోపికల యొక్క భక్తిని గురించి తెలియజేస్తున్నారు. తమ తను మన ధనములను, సర్వస్వమును శ్రీకృష్ణునికే అర్పించి సదా కృష్ణ నామ స్మరణంలోనే వుండి ఆయన గుణగణములను నిత్యము చింతించే గోపికల భక్తిని మించిన సంపూర్ణ భక్తి ఎవరికి ఉండగలదు? గోపికల భక్తిని గురించి స్వయంగా శ్రీకృష్ణుడే "**న పారయేహం నిరవద్య సంయుజాం స్వ సాధు కృత్యం విబుధాయుషాపి**" అంటూ నిష్కల్మషమైన వారి ప్రేమకు బ్రహ్మ పర్యంత కాలమైనా ఋణం తీర్చుకోలేనని తెలియజేయడమే వారి భక్తికి పరాకాష్ఠ. వారు తన ఆగమనానికై ఎల్లప్పుడూ ఎదురు చూస్తూ వుంటారని శ్రీకృష్ణుడు ఉద్ధవునితో సెలవిస్తూ "**ధారయంతి అతి కృచ్ఛేన ప్రాయః ప్రాణాన్ కథంచన**" అంటూ తన రాక కోసం ఎదురుచూస్తూ వారు తమ ప్రాణాలను నిలబెట్టుకున్నారని వివరిస్తాడు.

గోపికలు ఉద్ధవునితో తమ ప్రియతమ శ్యామసుందరునితో మాకు నిత్యము సంయోగమే కానీ వియోగం లేదని ఆయన ఎన్నడూ తమతోనే ఉంటాడని తెలియ జేస్తారు. నంద వ్రజములోని అణువణువులో గోపికలు శ్రీకృష్ణుని సందర్శించి తాదాత్మ్యం చెందుతారు. గోపికల భక్తిని చూసి పారవశ్యము చెందిన ఉద్ధవుడు "**గోవింద ఏవ నిఖిలాత్మని రూఢ భావాః వాంఛంతి యద్భవ భియో మునయోః**" అంటూ మునులకు కూడా శక్యము కాని విధముగా సదా గోవిందుని యెడల మనసును సంలగ్నము చేసి ఆయనను విశ్వాత్మకునిగా దర్శించగలుగుతున్నారని గుర్తిస్తాడు. అంతటి భక్తులైన గోపికల పాదధూళిని తన శిరస్సును ధరించాలని ఉద్ధవుడు భావిస్తాడు. సర్వ కర్మలను కృష్ణార్పణ భావంతో ఆచరించడమే కాక కృష్ణుని ఎడబాటును క్షణకాలమైనా భరించలేని గోపికలు నారదులు వివరించిన "**యథా వ్రజ గోపికానామ్**" అన్న భక్తి సూత్రమునకు అక్షర సాక్ష్యము అవుతారు కదా! అలాంటి కృష్ణ పారవశ్యములో మునిగిన నందవ్రజ వాసుల భక్తి గురించి నారదులు ఈ సూత్రము ద్వారా వివరిస్తున్నారు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జనవరి 2025**

1 బుధ: ఆంగ్ల సంవత్సరాది – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

8 బుధ: పుష్య శుద్ధ నవమి – శ్రీ రామలక్ష్మీ ప్రసాద మాతాజీ వారి ద్వితీయ వార్షిక ఆరాధన – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

10 శుక్ర; ముక్కోటి ఏకాదశి. – ఉత్తరద్వార దర్శనం, శ్రీ సద్గురు పాదపూజ.భక్త సమారాధన.

13 సోమ: పుష్య పూర్ణిమ, భోగి పండుగ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

14 మంగళ: సంక్రాంతి పండుగ – ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

15 బుధ: కనుమ పండగ

18 శని: శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన

24 శుక్ర; శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

27 సోమ: మాసశివరాత్రి

29 బుధ: అమావాస్య

**ఫిబ్రవరి 2025**

3 సోమ: వసంత పంచమి – శ్రీ సరస్వతీ పూజ,

4 మంగళ: రథసప్తమి

8 శని : భీష్మ ఏకాదశి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

12 బుధ: మాఘ(గురు) పూర్ణిమ. – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

22 శని : శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

26 బుధ: మహాశివరాత్రి – తె.జా.3.30 గం. లకు శ్రీ గురుదేవులకు బృందావనములో నమక చమక సహిత రుద్రాభిషేకము. ఉ.5.00 గం.లకు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయములో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు. మ.11.00 గం.లకు సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం.లకు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి సామూహిక కళ్యాణ మహోత్సవం.

27 గురు: – ఉ.11.00 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.
రాత్రి 7.గం.లకు శ్రీ ఉమారామలింగేశ్వర స్వామివారి నగరోత్సవం.

28 శుక్ర; అమావాస్య

# శ్రీకాళీ వనాశ్రమము - గీతా ప్రచార యజ్ఞం

## అమ్మ సందేశము

శ్రీబాబూజీ మహరాజ్ వారు ప్రస్థాన త్రయములో ఒకటైన భగవద్గీత యొక్క ప్రాశస్త్యమును గురించి వివరిస్తూ సాధకుడు దానిని దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకుని నిత్యము పఠిస్తూ ఆ గీతాసారమును అర్థం చేసుకుని అవలంబించాలని బోధించారు. అంతేకాక, భగవద్గీత దేశకాలాతీతమై ప్రకాశిస్తూ, అన్ని వయసుల వారికి ఇహపరములు రెండింటికీ దిక్సూచియై ముందుకు నడిపిస్తుందని శ్రీబాబు సెలవిచ్చారు.

మన నిత్య ప్రార్థనలో భాగమైన శ్రీమద్భగవద్గీత నిత్య జీవితంలో కూడా వుపయోగపడాలని శ్రీబాబు ఆశయాన్ని కొనసాగిస్తూ అమ్మ భక్తులలో స్ఫూర్తిని నింపుతున్నారు. శ్రీబాబు భక్తులు భగవద్గీతను ఇంటింటా పఠిస్తూ, దానిలోని తత్వమును ఊరూరా ప్రచారం చేయాలన్నది అమ్మ ఆకాంక్ష.

శ్రీశృంగేరి విద్యా భారతి ఫౌండేషన్ వారు గత 18 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరము గీతా దినోత్సవం సందర్భంగా వివిధ వయసులలో వున్న బాలబాలికలకు గీతా పఠనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో కేవలం గీతా పఠనమేకాక, భగవద్గీత మీద సమగ్రమైన అవగాహనను పరీక్షించడానికి వివరణాత్మకమైన అంశాలపై పృచ్ఛకులు ప్రశ్నిస్తారు.

2024 సంవత్సరంలో నవంబరు 10వ తారీఖున జరిగిన గీతా దినోత్సవంలో అమెరికాలోని శ్రీబాబు భక్త బృందం నుండి చిరంజీవి గురు అనంత్ మరియు చిరంజీవి చంద్రకాళీప్రసాద్ (వారణాసి కాళీప్రసాద్ మరియు త్రివేణీల కుమారులు) గీతా పఠనం, వ్యాసరచన మరియు వక్తృత్వ పోటీలలో పాల్గొన్నారు.

చి॥ అనంత్ అమ్మ ఆనతి మేరకు గురుదేవుల అనుగ్రహంతో సంపూర్ణ భగవద్గీతను కంఠస్థము చేసి 2023లో సంపూర్ణ గీతా సమర్పణ చేశాడు. అంతేకాక, వీరి కుటుంబం అమ్మ అదేశానుసారం భగవద్గీత యొక్క అర్థమును దానిని ఆధునిక యుగములో విద్యార్థినీ, విద్యార్థులకు అన్వయించుకునే పద్ధతిని పిల్లలకు అర్థమయ్యే రీతిలో వివరిస్తూ వీడియోలు తయారు చేస్తున్నారు.

శ్రీ గురుదేవుల కృపవలన చి॥అనంత్ వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతిని, గీతా పఠన పోటీలో ద్వితీయ బహుమతిని గెలుచుకున్నాడు. ఈ పోటీలలో పాల్గొన్న ఈ చిన్నారులకు అమ్మ తమ దీవెనలను, ఆశీస్సులను అందజేస్తున్నారు.

ఇదే విధంగా శ్రీబాబు భక్త సమాజంలోని ప్రతి ఒక్కరూ భగవద్గీతను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని, దానిలోని అంశాలను మననం చేసుకుంటూ, గీతా సారముతో శ్రీగురుదేవుల బోధనలను సమన్వయం చేసుకుంటూ శ్రీ గురుదేవుల ఆశయాన్ని ముందుకు తీసుకువెళ్ళి తరిస్తారని మీ అమ్మ అభిలాష.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి దాసరి నూకరత్నం గారు 9-12-2024 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 91 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## శ్రీ సద్గురుదేవుల షట్త్రింశతి [36]వ, వార్షిక మహాపుణ్యారాధానా మహోత్సవాలు 2024

**శ్రీ సద్గురు కోటినామ పారాయణ 18-11-24 నుండి 27-11-24 వరకు**

**1 కోటి, 17 లక్షల, 64వేలు**

**శ్రీ సద్గురు మండల దీక్షా పారాయణ17-10-24 నుండి 27-11-24 వరకు**

**1 కోటి, 97 లక్షల, 60 వేలు**

**మాలధారణ లేకుండా శ్రీ సద్గురు నామ పారాయణ**

**17-10-24 నుండి 27-11-24 వరకు**

**9 లక్షల, 14 వేలు**

### అన్నీ కలిపి మొత్తం శ్రీ సద్గురు నామ పారాయణ

### 3,24,35,000

### 3 కోట్ల, 24 లక్షల, 35 వేలు

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి

(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**85. వెలుగులకెల్ల వెలుంగై, వెలిగింపక వెలుగబోక వెలుగుచు దానే**
**వెలుగై యంతట వెలుగంగల సీతారామభద్రు గనుగొను మనసా.**

తాత్పర్యము: ప్రకాశము లన్నింటికి ప్రకాశమునిచ్చువాడు, స్వయం ప్రకాశము కలిగినవాడు, తన ప్రకాశముచే సర్వమును ప్రకాశింప జేయువాడు ఐన సీతారామభద్రుని తెలిసికొనుము మనసా.

**86. గుణముల బొరయకను విలక్షణుడై యపరోక్షుడై ప్రకాశించెడి యా**
**ప్రణవార్థగమ్యు నారాయణు సీతారామచంద్రు నరయుము మనసా.**

తాత్పర్యము: ప్రణవనాదమునకు అర్థము, గమ్యము అయినవాడు, ఎటువంటి గుణములకు లోబడని వాడు, విలక్షణుడు, అపరోక్షుడై ప్రకాశించేవాడు ఐన నారాయణుని సీతారామచంద్రుని పొందుము మనసా.

**87. శంకింపక పంకింపక సంకల్ప వికల్పములను జరుగక తగ నే**
**వంకకు బోవక విగత కళంకుని భద్రాద్రి విభు దలంపుము మనసా.**

తాత్పర్యము: సంకల్ప వికల్పములతో అనేక మార్గములలో తిరుగక, సందేహములతో సమాధానములతో దారిమళ్ళక, నిష్కళంకుడైన భద్రాద్రి విభుని తలచుకో మనసా.

**88. అజ్ఞానతమము బొరయక, ప్రజ్ఞానజ్యోతి యగుచు బరగెడు రాముస్**
**సుజ్ఞానముతో నీలో బ్రజ్ఞానముతో దలంపు పాయక మనసా.**

తాత్పర్యము: అజ్ఞానముతో తిరగక, ప్రజ్ఞాన జ్యోతియై వెలిగెడి రాముని సుజ్ఞానముతో నీలోని ప్రజ్ఞానమును తప్పక తలంచుము మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

మనసును దోచు మధురమైన ఈ మాటలనాలకించిన రాముడు తన సహోదరుడైన లక్ష్మణునితో, "ఈ విశ్వమందు కీర్తిపొందు విధమున మానవుడు నేర్వని కళలు, సముద్రమువలే విస్తరించియున్న వేదములు, భువనములు మరెక్కడా లేవని చెప్పుకొనదగు రీతిన తెలియపరచదగు తెలివితేటలు ఈతనికి కలవని మధురమైన ఈతని మాటలద్వారా తెలియుచున్నది కదా లక్ష్మణా! మధురముగ సంభాషించు సంపదగల ఈతనెవ్వడో? చతుర్ముఖుడా? లేక కాలమును ప్రళయమున ముంచివేయగల పరమశివుడా?

సోదరా! మనమెవరి సహాయమర్థించ దలచి వచ్చామో ఆతని మంత్రియే భగవంతుని దయవలన మన ముంగిట నిలిచియున్నాడు. అటువంటి మంత్రిని పొంద సుగ్రీవుడు తప్పక గొప్ప తపస్సు చేసి యుండాలి. ఈతడు సాధారణ మానవమాత్రుడు కాదు. ఋగ్యజుర్సామ వేదములను మరియు కొన్ని శాస్త్రములను అభ్యసించి, మధురమైన సంభాషణ చేయగల ఈతడు ఒక గొప్ప నవ వ్యాకరణ పండితుడై యుండాలి. కావున బహు హెచ్చరికతో పదములను లెక్కించిన రీతిలో మన స్థితిని ఈతనికి వివరించి, సుగ్రీవుని సహాయమును గోరి మన మిచ్చటకు వచ్చితిమని తెలియజేయుము" అన్నాడు రాముడు లక్ష్మణునితో.

లక్ష్మణుడు కూడ తాము అయోధ్యను వీడిన విషయం, వనవాసమందు తాము సీతను పోగొట్టుకున్న తీరు, కబంధుడు మరియు శబరి తెలియజేసిన విషయముల మేరకు తాము సుగ్రీవుని స్నేహమునుగోరి వచ్చామని వివరించి, "ఇదిగో ఈతడే రాజ్య పట్టాభిషేకమును విడనాడిన రాముడు. నేను ఆతని సహోదరుడు లక్ష్మణుడను" అని బదులిచ్చాడు.

"రామ!" అను శబ్దమునాలకించిన హనుమంతుడు పులకించిపోయి, 'నేను ఎవరి కోసం వేచియున్నానో ఆ దైవం నా

ఎదుట నిలిచింది' అని ఆనందపడి, సూక్ష్మరూపమును వీడి, తన నిజరూపము లోనికి వచ్చాడు. పిదప రామునికి వందనములొసగి, "అయ్యా! మీరు ఈ పర్వతముపై పయనించుట మీకు కష్టతరము. కావున మీరిరువురూ నా భుజములపై కూర్చోండి. నేను మిమ్ములను మా రాజువద్దకు చేరవేసెదను" అన్నాడు హనుమంతుడు.

రాముడు మిక్కిలి ఆనందపారవశ్యముతో తమ్ముడైన లక్ష్మణునితో ఇలా అన్నాడు. "లక్ష్మణా! మనం బయలుదేరినప్పుడు శుభ శకునములను పొందాము. కావున ఇంత గొప్ప హనుమంతుడు లభ్యమయ్యాడు. ఇకపై మనకు ఎట్టి కష్టములూ దరిజేరవు. ఈతడంతటి గొప్ప వీరుడు వానర కూటమునకు నాయకుడైన సుగ్రీవుని ఆనతిమేరకు నడుచుకుంటున్నాడంటే, ఆ సుగ్రీవునియొక్క స్వభావము ఎంత గొప్పదో!".

- సశేషం

### పెదనిండ్రకాలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

జనవరి 2025

10 శుక్ర: ముక్కోటి ఏకాదశి. - శ్రీ సద్గురు పాదపూజ.

13 సోమ: పుష్య పూర్ణిమ, భోగి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ

14 మంగళ: సంక్రాంతి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ.

24 శుక్ర: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

ఫిబ్రవరి 2025

8 శని : భీష్మ ఏకాదశి - భక్త సహిత శ్రీ సద్గురు మూర్తి ప్రతిష్ఠ 21వ వార్షికోత్సవము. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన

12 బుధ: మాఘ(గురు) పూర్ణిమ. - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

22 శని : శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

26 బుధ: మహాశివరాత్రి - శ్రీ సద్గురు పాదపూజ

## నిష్కామ కర్మ ఫలం

- రావి శోభ

సనందుడు ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినవాడు. ఉపనయనం జరగటం వలన యజ్ఞయాగాలకు అవసరమైన సమిధలు, దర్భల కోసం అడవికి వెళ్ళాడు. అక్కడ తనకు కావలసినవి సేకరించుకుని, అక్కడే ఉన్న ఒక పెద్ద రాతి బండ మీద వాటిని పెట్టుకుని, తానూ ఆ రాతిమీదే కూర్చుని కళ్ళు మూసుకుని ఇంట్లో ఎప్పుడూ చర్చించే దైవాన్ని, ఆయన వ్యాపకత్వాన్ని తలచుకుంటూ తనలో తానే ఆలోచించు కుంటున్నాడు.

అప్పుడే ఆ సనందుడి ముందు నుంచే వెడుతున్న బోయవాడు ఒంటరిగా కూర్చుని ఏదో ఆలోచిస్తున్న ఆయన్ని చూసి, దగ్గరగా వెళ్ళి, 'సాములూ! మీరు ఎవరు? ఒంటరిగా కూర్చుని దేని గురించి ఇంతగా ఆలోచిస్తున్నారు? నాకు చెప్పండి. ఎందుకంటే నాకు ఈ అడవి మొత్తం ఏవైపు ఏం వుంటాయో అన్నీ బాగా తెలుసు. మీకు శ్రమ లేకుండా నేను చేసిపెడతాను. మీకు ఏమి కావాలో దయచేసి నాకు చెప్పండి' అన్నాడు.

అప్పుడు ఆ సనందుడు 'నాయనా! కిరాతకా! నాకు సాయం అందించాలని అనుకుంటున్నావు చాలా సంతోషం. కానీ నేను ఒక బ్రాహ్మణుడను. నేను ఒక రూపాన్ని వెతుకుతున్నాను. అదీ ఇవాళ కాదు. ఇలా నేను ఎప్పటి నుండో వెతుకుతున్నాను. కానీ, నాకు కనబడలేదు. అందరికీ ఆ రూపం అంత తేలికగా కనబడదని మా పెద్దలు చెప్పారు. కానీ నమ్మకంగా వెతికితే మాత్రం తప్పకుండా కనిపిస్తుందని కూడా చెప్పారు. అందుకే ఈ ప్రయత్నం' అన్నాడు.

అప్పుడా కిరాతకుడు 'అయ్యా! మీరు వెతుకుతున్న దాని ఆనవాలు నాకు చెప్పండి చాలు. ఆ సూర్యుడు కొండల వెనకాలకి వెళ్ళేలోపు మీ ముందుకు తెస్తాను. ఎందుకంటే ఈ అడవి అంతా నా చిన్నప్పటి నుండి తిరుగుతున్నాను. కాబట్టి నాకు బాగా తెలుసు' అన్నాడు పట్టుదలగా.

సరే ఇహ ఏదో ఒకటి చెబితేగానీ వీడు నన్ను వదిలేటట్టు లేడనుకుని, 'కిరాతకా! ఆ రూపం సింహంతలతో, మానవ శరీరంతో వుంటాడు' అని చెప్పాడు.

- సశేషం

# శ్రీ గురుగీతా

(గత సంచిక తరువాయి) -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

గీతలు అనేకం ఉన్నాయి, భగవద్గీత, ఉత్తరగీత, అష్టావక్రగీత, అవధూతగీత, ఋషిగీత, భిక్షుగీత, శివగీత, హంసగీత.... ఎన్నియో! ఇక్కడ సూతమహర్షి "గీతాం" అనినాడు కాని "గురుగీతాం" అనలేదు. మునులు "గురుగీత"ను చెప్పమని అడిగిరి గనుక ఆ విషయం స్పష్టమే, అయినా ఆయన పలికిన విధానంలో "గీతాం" అనేపదం గురుగీతకే అన్వర్థ నామమైనట్లు తోచుచున్నది. మిగిలిన గీతలు బోధద్వారా, బోధించిన సాధనల ద్వారా, పారంపర్య ఫల ప్రాప్తిని కల్గించగా, గురుగీత "శ్రవణ మాత్రేణ" (వినినంత మాత్రము చేతనే) మోక్షాన్ని ప్రసాదించునని భావం. ఎవరికైనను కోరిన వస్తువు లభించగా సంతోషము కలుగును. మహా వాక్యతుల్యమైన బోధ లభించును గనుక సంతోషముతో శ్రద్ధగా వినవలెనని హెచ్చరించుచున్నాడు సూత మహర్షి.

**పురాకైలాస శిఖరే సిద్ధ గంధర్వ సేవితే**
**తత్ర కల్పలతా మందిరే ఉ త్యంత సుందరే 8**
**వ్యాఘ్రాజినే సమాసీనం శుకాది ముని వందితం**
**బోధయంతం పరంతత్త్వం మధ్యేమునిగణం క్వచిత్ 9**
**ప్రణమ్ర వదనా శశ్వన్నమస్కు ర్వన్తమాదరాత్**
**దృష్ట్వా విస్మయ మాపన్నా పార్వతీ పరిపృచ్ఛతి 10**

**<u>పదవిభాగము</u>** :-

పురా-కైలాస శిఖరే- సిద్ధ గంధర్వ సేవితే-
తత్ర- కల్పలతా మందిరే- అత్యంత సుందరే; 8
వ్యాఘ్రాజినే-సమాసీనం-శుకాది ముని వందితం-
బోధయంతం-పరంతత్వం -మధ్యే మునిగణం-క్వచిత్ 9
ప్రణమ్రవదనా-శశ్వత్-నమః-కుర్వన్తం-ఆదరాత్ -
దృష్ట్వా -విస్మయమాపన్నా -పార్వతీ-పరిపృచ్ఛతి. 10

**టీక** :- పురా=పూర్వము; సిద్ధగంధర్వ సేవితే= సిద్ధులచేత, గంధర్వులచేత సేవింప (పూజింప) బడుచున్న; కైలాస శిఖరే= కైలాస శిఖరమునందు, తత్ర= అచ్చట; అత్యంత సుందరే= అత్యంత సుందరమైన; కల్పలతామందిరే= కల్పలతలచే నేర్పరచబడిన మందిరము నందు; మధ్యే మునిగణం= ముని సమూహముమధ్య; శుకాది ముని వందితం= శుకాది మహర్షులచే పూజింపబడుచు, పరంతత్త్వం= పర(మ)తత్త్వమును; బోధయంతం= బోధించుచున్న; క్వచిత్= ఒక (ఒక్కొక్క) సమయమున; శశ్వత్= మరలమరల; ఆదరాత్= ఆదరముతో; నమస్కుర్వంతం= నమస్కరించుచున్న (మహేశ్వరుని), దృష్ట్వా=చూచి; విస్మయం= ఆశ్చర్యమును; ఆపన్నా= పొందినదై; ప్రణవ్రు వదనా=గౌరవముతో తలవంచి వినయముతో; పరిపృచ్ఛతి= ప్రశ్నించుచున్నది.

**వ్యాఖ్య** :- "పూర్వం ఒక పర్యాయము అత్యంత సుందరమైన కల్పలతా మందిరమున మహర్షి సమూహ మధ్యమందు, శుకాదుల పూజ లందుకొనుచు, పులితోలు ఆసనంపైన కూర్చుని మరలమరల నమస్కరించు చున్న శంకరుని చూచి అత్యంతాశ్చర్య చకితురాలైన పార్వతి వినయముతో తలవంచి భక్తితో యిలా పరిప్రశ్న చేసినది".

"ఈ మూడు శ్లోకాల ఉద్దేశ్యమూ కథాకథనమే అయినా, వీటిలో కొన్ని విశేషాలున్నాయి. అది కల్పలతా మందిరమట. కల్పలతకే కోరిన వారి కోరికలు తీర్చే సామర్థ్యం ఉన్నది. ఇక ఆ కల్పలతా మందిరంలో ఉండే భక్త కల్ప వృక్షమైన పరమేశ్వరుడి శక్తి, వదాన్యతలు ఊహాతీతములు. ఆ మందిరమును ఆశ్రయించుకుని ఉన్నవారు శుకాది మహర్షులు. వారికి బోధిస్తున్న వాడు వ్యాఘ్రాజినస్థుడైన పరమశివుడు. శుకుడు మోక్ష కారకమైన భాగవత కల్పతరువును ఆశ్రయించి, వేదకల్పవృక్ష విగళితమైన భాగవత ఫలాన్ని పరీక్షిత్తుకు, తద్వారా మానవజాతికి అందించిన మేధావి. అటువంటి మేధావులకు బోధించుచు మరల మరల భక్తితో నమస్కరించుచున్న పరమేశ్వరుని  చూచినచో ఎవరికైనను ఆశ్చర్యము కలుగకమానదు. అందువలననే ఆశ్చర్యంతో పరిప్రశ్న చేసినది అమ్మవారు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీబుల్లిమామయ్య తెలిపిన శ్రీబాబు లీలలు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

16. ఒకసారి శ్రీ బాబుతోపాటు భక్తులు కారులో భీమవరం వెడుతున్నారు. సీతారామయ్యగారు కూడా వారితోనే ఉన్నారు. అప్పటిలో శ్రీ బాబు కారును నడిపే ఆచార్యులుగారే కారును నడుపుతున్నారు. కారు కైకలూరు దాటి భీమవరం వైపు వెడుతున్నపుడు శ్రీ బాబు కాసేపు తాము కారు నడుపుతామని, ఆచార్యుల వారిని వెనుక సీటులో కూర్చోబెట్టి, తాము నడపటం మొదలు పెట్టారు. కనీ వినీ ఎరుగనంత స్పీడుతో శ్రీ బాబు కారు నడుపుతుంటే కారులో వారికి ఎందుకో అర్థం కాకపోగా కొంచెం భయం కూడా కలిగింది. అంతలో రోడ్డు ఒక మోచేతి మలుపు తిరగవలసి వచ్చింది. అటు నుంచి ఏమి వస్తున్నదో కనబడనంత మలుపులోను శ్రీ బాబు అదే వేగంతో కారును మలుపు త్రిప్పుతుండగా, ఆరేళ్ళ కుర్రవాడొకడు రోడ్డుకు అడ్డంగా పరుగెత్తుకుంటూ వచ్చాడు. శ్రీ బాబు "అమ్మా! కాళీ!" అని కేక పెడుతూ గట్టిగా బ్రేకు వెయ్యటము, కారు టైర్లు రోడ్డును గట్టిగా రాచుకుంటూ పెద్ద చప్పుడుతో సరిగా ఆ కుర్రవానికి బెత్తెడు దూరంలో ఆగటము, కారు అతనికి తాకక పోయినా భయం కొద్దీ ఆ కురవ్రాడు క్రిందపడి వెంటనే లేచి దుమ్ము దులుపుకుని పరుగెత్తుకుని వెళ్ళిపోవటము అంతా క్షణాలలో జరిగిపోయింది.



శ్రీ బాబు అప్పుడు మళ్ళీ ఆచార్యులుగారిని కారు నడపమని, తాము తమ సీటులోకి వచ్చి కూర్చుని "కైకలూరు దాటుతున్నపుడే, ఒక కుర్రవాడు పెద్ద కారు ప్రమాదానికి గురి కాబోతున్నాడని, అతడు

అసాధారణ మేధాశక్తి గలవాడని, భవిష్యత్తులో అతని కుటుంబమంతా అతని మీదనే ఆధారపడవలసి ఉన్నదని, అతనికి ఆ గండం తప్పించే వరకు కారును నన్ను నడపమని జగన్మాత సూచన అందించింది. అందుకే ఆచార్యులుగారి నుంచి నేను డ్రైవింగ్ తీసుకోవలసి వచ్చింది. జగన్మాత కృప వలన ఆ అదృష్టశాలికి రక్షణ జరిగింది'' అన్నారు.

17. ఒకసారి శ్రీ బాబు సీతారామయ్యగారితోను, వడాలి పిన్నిగారు, మరికొందరు భక్తులతోను విశాఖపట్నం నుండి గుంటూరు వస్తూ అన్నవరం గుడికి వెళ్ళారు. భక్తులందరిని లోపలికి వెళ్ళి స్వామి దర్శనం చేసుకుని రమ్మన్నారు. శ్రీ బాబు, సీతారామయ్యగారు, వడాలి పిన్నిగారు బయటనే ఒక చెట్టు నీడలో నిలబడి తత్త్వ విచారణ చేసుకుంటున్నారు.

అంతలో కొందరు తపస్వులు శ్రీ బాబు వద్దకు వచ్చి "అయ్యా! యీ నాడు మా భాగ్యమే భాగ్యము. తమలో సాక్షాత్తు సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకోగలుగుతున్నాము. ఈ దివ్య దర్శనాన్ని పొందటానికి మేమందరము ఎంతో కాలం నుండి తపస్సు చేస్తున్నాము. మమ్మల్ని అనుగ్రహించండి'' అన్నారు. శ్రీ బాబు వారికి ప్రతి నమస్కారం చేస్తూ "నిర్మల హృదయానికి సర్వే సర్వత్ర సత్యమే దర్శనమౌతుంది. తమరు పొందిన అనుభవం తమ నిర్మలాంతఃకరణలకు నిదర్శనము. అంతేగాని నాలో ఏమున్నది? ఆ ప్రభువు సత్యనారాయణ స్వామివారి పరిచారక, భృత్య భృత్య, భృత్యుల భృత్యులలో ఒకడను కాగలిగితే నా జన్మ సార్థకమైనట్లుగా భావిస్తాను'' అన్నారు.

- సశేషం

## విష్ణు కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# కనకదాస్

"హే భగవాన్! నా మొర ఆలకించి తలుపులు తెరిచి నాకు దర్శనమియ్యి ప్రభూ!" స్వామి వియోగాన్ని భరించలేక తన శిరస్సును గుడి తలుపులపై బాదాడు. శిరస్సునుండి రక్తం కారుతోంది. ఆదికేశవస్వామి అనుగ్రహించాడు. గుడి తలుపులు తెరుచుకొన్నాయి. స్వామి దర్శనమిచ్చాడు. ఆ దివ్య దర్శనంతో పులకితుడై కేశవస్వామిని కీర్తించాడు. "మరణ సమయంలో కూడా నీ నామస్మరణ చేస్తూండేటట్లుగా చెయ్యి" అని వేడుకున్నాడు. ఈ విధంగా తిమ్మప్ప నిర్మలమైన బంగారం వలె ప్రకాశించే బుద్ధిని పొంది, 'కనకదాసు'గా ప్రసిద్ధి చెందాడు. అతనికి భోగ భాగ్యాలపై విరక్తి ఏర్పడింది. అతనిలో ఐహిక వాంఛలు నశించాయి. నిరంతరం భగవన్నామ స్మరణలో పరవశుడై త్యాగమయ జీవనం గడుపుతూ స్వామి దర్శనానికై పరితపిస్తున్నాడు.



ఒకనాడు స్వప్నంలో కేశవస్వామి కనిపించి, "హంపీ నగరవాసి అయిన వ్యాసరాయ గురువు వద్ద మంత్రదీక్ష పొంద"మని ఆదేశించాడు. కనకదాసు హంపీ నగరం చేరి వ్యాసరాయలవారిని దర్శించి, తనను శిష్యునిగా స్వీకరించి మంత్రదీక్ష ఈయమని ప్రార్థిస్తాడు. కనకదాసుకు మంత్ర దీక్ష ఇవ్వటం ఇష్టం లేనట్లుగా నటిస్తూ, "దున్నపోతు నామం జపించు" అన్నారు. అంతే! అకుంఠితమైన విశ్వాసంతో , నిర్జన ప్రదేశంలో కూర్చుని దున్నపోతు నామాన్ని జపించసాగాడు.

తన వాహనమైన దున్నపోతు నామాన్ని జపిస్తున్న కనకదాసుకు యముడు దున్నపోతు రూపంలో ప్రత్యక్షమై, "నీకు ఏమి కావాలో అడుగు!" అన్నాడు. కనకదాసు "నాకేమీ అవసరం లేదు. నా గురుదేవులకు కావలసిన అవసరాలను తీర్చండి" అని, యమధర్మరాజుని వ్యాసరాయల సన్నిధికి తీసుకు వచ్చాడు.

జరిగినదంతా విని వ్యాసరాయలవారు ఆశ్చర్యపడ్డారు. ఇంకా పరీక్ష చేయదలచి, తాను తవ్విస్తున్న కాలవలో అడ్డంగా ఉన్న పెద్ద బండరాయిని తొలగించమని దున్నపోతుని కోరగా, దున్నపోతు ఆ బండరాయిని తొలగించి అదృశ్యమవుతుంది. బండను తొలగించిన ఈ తూమును "కనకతూము" అని పిలుస్తారు. వ్యాసరాయలవారు అతని భక్తి శ్రద్ధలను చూసి సంతుష్టుడై అతనిని తన శిష్యునిగా స్వీకరించాడు. కనకదాసు గురించి ఇంకో కథనం కూడా వున్నది.

శ్రీ వ్యాసరాయలువారు తమ శిష్యులను పిలిచి "ఎవ్వరూ లేనిచోట ఈ పండును ఆరగించి రావాలి" అని వారికి పళ్ళు ఇచ్చారు. శిష్యులు తాము ఎంచుకొన్న చోటుకి వెళ్ళి ఎవ్వరూ లేరని నిర్థారించుకొని, వారికిచ్చిన పళ్ళను భుజించి వచ్చారు. ఒక శిష్యుడు మాత్రం ఆ పండును తినకుండా గురువుగారి వద్దకు వచ్చి,"గురుదేవా! నేను మీ ఆదేశాన్ని పాటించలేకపోయాను. ఎక్కడకు వెళ్ళినా భగవంతుడు నన్ను చూస్తూనే ఉన్నాడు. అందువలన నేను తమరు ఇచ్చిన పండును తినలేకపోయాను" అన్నాడు. శిష్యుడు చెప్పినది విని గురువుగారైన వ్యాసరాయలవారు పులకాంకితులైనారు. గురుదేవులను మెప్పించిన ఆ వ్యక్తి ఎవరో కాదు. అతడే కనకదాసు.

ఒకనాడు వ్యాసరాయలవారు పూజామందిరంలో కనులు మూసికొని స్వామిని పుష్పమాలాలంకృతుని చేసే సందర్భంలో మాల వేసేముందు స్వామి కిరీటం తీయాలా వద్దా అన్న సందేహం వస్తుంది. అక్కడే ఉన్న కనకదాసు గురుదేవుల మనస్సును గ్రహించి, "గురుదేవా! కిరీటం పెద్దదిగా ఉంది. పూలహారం చిన్నదిగా ఉంది కనక మీరు పూలహారాన్ని స్వామి పాదాలపై ఉంచండి" అని చెబుతాడు.కనకదాసు చూపించిన ఈ ప్రతిభ అతని భక్తి పరాకాష్ఠకు తార్కాణమని వ్యాసరాయలవారు సంతోషించారు. - సశేషం

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము, పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

## శ్రీగురుదేవుల ప్రతిష్ఠా మహోత్సవం

శ్రీగురుదేవుల ప్రతిష్ఠా మహోత్సవం - భీమవరం పట్టణములో శ్రీగురుదేవుల బృందావన నిర్మాణము త్వరితగతిన జరుగుతున్న విషయం భక్తులందరికీ తెలిసినదే. వచ్చే మాఘమాసము నాటికి పూర్తి కాగలదని ఆశిస్తున్నాము. ప్రతిష్ఠామూర్తులు కూడా తయారయ్యి భీమవరం చేరుకున్నాయి. అందువలన దైవజ్ఞులచే ప్రతిష్ఠా ముహూర్తము నిర్ణయించబడినది.



ది.12.03.2025 బుధవారము ఉ.10.42 గం.లకు గృహప్రవేశము, అనంతరం యాగశాలా ప్రవేశము, మండపారాధనలు ది.13.03.2025 నుండి యాగము, అధివాసములు. ది.17.03.2025 సోమవారము ఉ.10.22 గం.లకు శ్రీ గురుదేవుల అభయ క్షీర శిలామూర్తి ప్రతిష్ఠ జరుగును. భక్తులందరూ ఈ కార్యక్రమములో పాల్గొన వలసినదిగా ఆహ్వానిస్తున్నాము. భవన నిర్మాణమునకు ఇప్పటికే కొంతమంది భక్తులు తమ సహాయం అందించారు. నిర్మాణమునకు అవసరమైన నిధులు ఇంకా సమకూరలేదు. ఉదార హృదయులైన భక్తులందరూ యథాశక్తి తమ సహాయ సహకారములు అందించ వలసినదిగా ప్రార్థిస్తున్నాము.

ముఖ్యవిషయం: ప్రతిష్ఠానంతరం బృందావనంలో నిత్యసేవకు నెలకు ఇద్దరు చొప్పున 12 నెలలకు అవసరం ఉంటుంది. నిత్యసేవ చేసుకునే ఆసక్తిగల భక్తులు ముందుగానే తమ పేర్లు నమోదు చేసుకొనవలసినదిగా ప్రార్థన. జైగురుదేవ్.

భక్తులు యిచ్చు విరాళములకు ఐ.టి. యాక్ట్ 80జి క్రింద పన్నురాయితీ లభించును. విరాళములు ఈ క్రింది బ్యాంక్ ఎకౌంటుకు పంపవలెను.

Sri SriSri Hanumath Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Bhimavaram Branch
SB Account No.69900 1000 00 172
IFSCode: BARB0BHIMAV

మరింత సమాచారము కొరకు:

మురళీ - 93983 34345

తుమలపల్లి శివ: 96181 99556

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

అక్టోబరు 26 నుండి నవంబరు 2 వరకు శ్రీశైలక్షేత్రంలో జరిగిన ఆశ్రమ శాఖ శంఖుస్థాపన,
శివనామ సంకీర్తన మరియు సత్సంగ దృశ్యములు









REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26





శ్రీ కాళీవనాశ్రమంలో
నిర్వహించిన దీపావళి
దృశ్యములు



శ్రీ కాళీవనాశ్రమ
హైదరాబాదు శాఖలో
కార్తీక పౌర్ణమి నాడు
శ్రీ సద్గురు పాదపూజ

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.